స్వార్జితం

దూరం నుంచే కనిపిస్తున్నాయి బిల్డింగ్స్.
తెలుపు, ఆకుపచ్చ రంగుల కాంబినేషన్.
చుట్టూ ఈ చివరినుంచి ఆ చివరిదాకా.. ఆకాశాన్నంటుతూన్నట్లుగా వున్న చెట్లు.
నిలువెత్తు పుట్టలమధ్య ఘోరతపస్సులో మునిగిపోయిన మౌనిలా వుంది కాలేజ్.
"ఎన్నాళ్ళయింది యిక్కడికి వచ్చి! రెండు.. మూడు.. దాదాపు నాలుగు సంవత్సరాలు.
ఒకప్పుడు యివే పరిసరాలలో తిరిగేవాళ్ళు. నవ్వులతో.. కేరింతలతో.. గొడవలతో..
ఎంత అల్లరి చేసేవాళ్ళు!
కాలేజ్‌నుంచి బస్‌స్టాప్‌కి వెళ్ళడం.. బస్‌స్టాప్ నుంచి కాలేజ్‌కి రావడం..
నిజంగా అదంతా వ్రాస్తే ఓ కావ్యం. చెప్పుకుంటే మరో భారతం.
ఎలా చేసేవాళ్ళో యింత బిజీరోడ్డుమీద అంత అల్లరి!"
కణకణలాడ్తున్న ఎండలో నడుస్తూ గతాన్ని గుర్తు చేసుకుంది రజని.
"చెవులు చిల్లులు పడేలా శబ్దం చేస్తూ చీమల్లా తిరిగే బస్సులూ.. కార్లూ.. రద్దీ. విపరీతమయిన ఎండ!
రోడ్డుమీద ఎక్కడా ఒక్క చెట్టుకూడా లేకపోవడం వల్లనేమో! ఇక్కడ ఎండ మాడ్చేస్తుంది. అసలే నీరసంగా వుంది. ఎండలో నడుస్తుంటే మరీ కళ్ళు తిరుగుతున్నట్లనిపిస్తోంది.
ఎలాగోలా కాలేజ్ మెయిన్ గేట్ చేరుకుంటే చాలు. ఇక అక్కడినుంచీ చల్లగా, హాయిగా వుంటుంది.

చెట్లమధ్యగా.. పచ్చటి లాన్‌లోనుంచీ అలా నడుచుకుంటూ వెళ్ళడం.. రంగురంగుల డ్రెసెస్‌లో అటూ యిటూ తిరిగే పువ్వుల్లాంటి అమ్మాయిలని చూడడం!

ఆస్వాదించడం తెలియాలిగానీ ఉమెన్స్ కాలేజ్ కన్నా అందమైన ప్రదేశం ఏముంటుంది!"

ఎదురుగా వస్తూన్న అమ్మాయిని చూసి అప్రయత్నంగా ఒక్కక్షణం ఆగింది రజని. ఎవరో ఆ అమ్మాయి! చాలా బాగుంది.

లేత గులాబీరంగు ప్లెయిన్ చుడీదార్. పైన అంతా సాదాగా వుండి క్రింద కుచ్చులు వున్నాయి. ఇప్పటి ఫ్యాషన్ కాబోలు. మెత్తటి క్లాత్ సన్నటి ఆమె నడుముని అంటిపెట్టుకుని కళ్ళు తిప్పుకోనివ్వడంలేదు.

అందంగా వూగుతూన్న పోనీటెయిల్. ఎత్తైన గుండెలమీద షో బటన్.. ఆనందంతో కళకళలాడిపోతున్నట్లుగా వుంది ఆ అమ్మాయి మొహం.

పరిసరాల స్పృహే వున్నట్లు లేదు. తనలో తనే ముసిముసిగా నవ్వుకుంటోంది. అలా నవ్వుతూనే రజనిని దాటి వెళ్ళిపోయింది.

"ఎంత ఆనందంగా వుంది ఆ అమ్మాయి! తనూ అలాగే వుండేది నాలుగేళ్ళ క్రితం. గులాబీలు పూసే బుగ్గలతో.. కలల భారంతో వాలిపోయే కళ్ళతో. ఇప్పుడు!!

ఇప్పుడు ఆ హుషారూ లేదు . ఆ కలలూ లేవు. రొటీన్ లైఫ్." నిట్టూర్చింది రజని.

ప్రతిరోజూ ఒకేరకంగా గడిచిపోతుంది. మొదట్లో ఏమీ తోచడంలేదంటే "మంచి మంచి పుస్తకాలు చదువుకో. సినిమాలు చూడు." అని సలహాలు యిచ్చేవాడు మాధవ్.

"పోనీ కాదంటే ఏదన్నా ఉద్యోగం చేయి" అనేవాడు అదేదో చాలా చిన్న వ్యవహారంలా.

ఆమెకు చిర్రెత్తుకొచ్చేది. "ఆ. అదొక్కటే తక్కువయింది!" అనేది అసహనంగా.

మాధవ్ ఆమెవైపు ఒకసారి సీరియస్‌గా చూసేవాడు. "ఇలా అయితే చాలా కష్టం రజనీ. నేను సంపాదించేదంతా నీ సుఖం కోసమే. నీకు సుఖపడడం చేతకాకపోతే నేనేం చేయను చెప్పు!" అనేవాడు.

"ఒక్క విషయం గుర్తుపెట్టుకో. సుఖమూ, ఆనందమూ ఎక్కడో వుండవు. కష్టపడడంలోనూ, ఎదగడంలోనూ వుంటాయ్. చివరిరెండూ చేయడానికి నువు యిష్టపడకపోతే మొదటి రెండూ నీకు దొరకవు." అని చెప్పేవాడు.

అతను అలా కోపంగా మాట్లాడితే ఆమెకి యింకా ఏడుపొచ్చేది. తన వంటరితనాన్ని అర్థం చేసుకోకుండా ఏదేదో చెప్తారేమిటి! అనిపించేది.

"ఇలా ఉపన్యాసాలివ్వడం మాత్రం బాగా తెలుసు" అనేది ఉక్రోషంగా.

మాధవ్ నవ్వేసేవాడు. ఆమె ఏడుపుమొహం పెడితే యింకేం మాట్లాడేవాడు కాదు. చాలా ఆవేశంగా దగ్గరికి తీసుకునేవాడు.

నీళ్ళు నిండిన కళ్ళమీదా, బుగ్గలమీదా ముద్దుల వర్షం కురిపించి "నిజమే. నీతో యింతసేపు డిస్కషన్స్ ఏమిటి నాకసలు! అంతకన్నా ముఖ్యంగా చేయాల్సిన పనులు చాలా వుండగా!!" అనేవాడు చెవిలో అల్లరిగా.

మర్నాటినుంచీ మళ్ళీ మామూలు. ఆమె అసంతృప్తీ, దిగులూ యిలాగే వుండేవి.

మాధవ్ ఉద్యోగమూ, హడావిడీ అలాగే వుండేవి. "ఇదేమిటి! ఎంత నడిచినా ఈ దూరం తరగడం లేదు!" నుదుటిమీది చెమటను కర్చీఫ్‌తో అద్దుకుంటూ అనుకుంది రజని. ఇంకో నాలుగడుగులు వేశాక, కుడిప్రక్కగా కనిపించింది ఆమెకి పబ్లిక్ టెలిఫోన్.

"క్రొత్తగా పెట్టినట్లున్నారు యిక్కడ! కాలేజ్‌లో ఫోన్ వుంటే ఎంత హాయి! పిల్లలందరికీ ఎంత ఉపయోగం!" పాతరోజులు గుర్తొచ్చాయి రజనికి.

"అప్పట్లో మాధవ్‌కి ఫోన్ చేయాలంటే ఎంత ప్రాబ్లమ్ అయ్యేదో! కాలేజ్ బయటకి రావడానికే పావుగంట పట్టేది. షాపులలోనుంచీ, హొటల్స్‌లోనుంచీ చేయాలంటే బెరుకుగా వుండేది. లంచ్‌టైంలో గబగబా అన్నం తినేసి తనూ, సరితా పరుగెత్తుతున్నట్లుగా బయటకి వచ్చేవాళ్ళు.

"ఏమిటే ఈ బాధ! నీ బాయ్‌ఫ్రెండ్‌కి నువు ఫోన్ చేస్తుంటే మధ్యలో నాకు ఈ కష్టాలు ఏమిటే!" అనేది అది ఆయాసపడుతూ.

సరితతోనే బాగా క్లోజ్ గా వుండేది తను. తన ప్రేమ వ్యవహారం మొత్తం క్షుణ్ణంగా తెలిసింది సరితకి ఒక్కదానికే.

అందుకే అదలా నిష్ఠూరాలాడితే తను నవ్వేసేది. భుజాల చుట్టూ చేయి వేసి బుగ్గ మీద గట్టిగా ముద్దు పెట్టుకునేది."

రజని కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి. "ఎక్కడుందో యిప్పుడు సరిత!"

పాతరోజులు గుర్తొస్తున్న కొద్దీ ఆమె దుఃఖం మరీ పెరుగుతోంది.

"ఏమైపోయింది తనలో ఆ ఆనందమంతా! ఆ హుషారంతా ఏమైపోయింది!"

ఇప్పుడు ప్రతిరోజా సూర్యోదయమవుతుంది. మధ్యాహ్నమవుతుంది. సాయంత్రమవుతుంది. నిట్టూర్పులు కూడా విసుగు చెందేలా చీకటి పడుతుంది. చెప్పలేనంత చిరాకుతో మళ్ళీ తెల్లవారుతుంది.

ఎందుకు! ఎందుకిలా అయిపోయింది తన జీవితం!!

మాధవ్‌ని పెళ్ళి చేసుకునేరోజున ఎన్ని వూహించుకుంది! జీవితమంతా నందనవనంలా వుంటుందనుకుంది."

దుఃఖంతో రజని పెదవులు వణికాయి.

"పెళ్ళి చేసుకుని పొరపాటు చేసిందా తను! దానివల్లనే తన ఆనందమంతా యిలా హరించుకుపోయిందా!

మరి మాధవ్ ఆనందంగానే వుంటాడే! అవును. ఈ రోజుకీ మాధవ్ ఆనందంగానే వుంటాడు.

పెళ్ళికి ముందు లాగానే.. ఉహు. అంతకన్నా ఎక్కువగానే ఆనందంగా వుంటాడు. కానీ తన విషయం మాత్రం ఏమీ పట్టించుకోడు. తన ఆనందం కోసం ఏమీ చేయడు.

అదేమంటే "ఆనందం అనేదాన్ని ఎవరికి వాళ్ళు తమ మనసులలోనే సృష్టించుకోవాలి. ఒక మనిషి ఆనందం కోసం మరోమనిషి చేయగలిగింది చాలా తక్కువ వుంటుంది" అంటాడు.

నిజమేనేమో! మాధవ్ పద్ధతి చూస్తే అలాగే అనిపిస్తుంది. మరి తనకెందుకు ఈ నిరాసక్తత!

అందరిమీదా చిరాకు, కోపం... చివరికి మా..ధ..వ్ తో కూడా పోట్లాడుతోంది తను!

ఎంత దారుణం! తను ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించే మాధవ్‌తో కూడా పోట్లాడుతోంది!!"

రజని గుండెలలోనుంచి వెచ్చటి నిట్టూర్పు దూసుకు వచ్చింది.

"నిన్న రాత్రి యిలాగే బాధపడుతూ వుంటే మాధవ్ చాలాసేపు బ్రతిమలాడాడు. తను లొంగలేదు. "నా సంగతి ఏమీ పట్టించుకోవడం లేదు. మీ సుఖమే మీరు చూసుకుంటున్నారు" అంది. మాధవ్ అసహనంగా లేచి అవతలిగదిలోకి వెళ్ళిపోయాడు.

"సదా ఏడుస్తూండాలని నువ్వు తీవ్రంగా నిర్ణయించుకున్న తర్వాత నీముందు నేను నవ్వుతూ తిరగడం వ్యర్థం. అది నిన్ను యింకా ఏడిపిస్తుంది. ఆ విషయం నాకిపుడే అర్థమయింది." అన్నాడు.

తెల్లవారాక కూడా తనని పలకరించలేదు. అతని పని అతను చేసుకుని ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు. తనుకూడా చాలాసేపు మంచంమీదనుంచి లేవలేదు. తొమ్మిదయ్యాక అప్పుడు లేచి స్నానం చేసింది. ఇంట్లో కూర్చుంటే పిచ్చెక్కుతుందేమో అనిపించింది. ఎక్కడికి వెళ్ళాలో అర్థం కాలేదు.

తాళం పెట్టి బయటకి వచ్చింది. కాళ్ళు నడిపించినట్లుగా నడుస్తూ వస్తే కాలేజ్ కనిపించింది."

కాలేజ్ మెయిన్ ఎంట్రన్స్ ... మొదటి మెట్టు తగలగానే రజని ఆలోచనలలోనుంచి తెప్పరిల్లింది. ఒక్కసారి శరీరం ఆపాదమస్తకమూ కంపించినట్లయింది.

ఈ చివరినుంచి ఆ చివరివరకూ సాగిన మెట్లు.. వాటికి రెండు వైపులా పూలకుండీలు..

ఏదో తెలీని భావంతో గుండె వణికింది.

మొదటిరౌండ్ మెట్లు ఎక్కి ప్రక్కకు తిరగగానే.. కారిడార్‌లో నిలువెత్తు పెయింటింగ్. ఇందిరాగాంధీ బొమ్మ.

"ఎంత బాగుంటుందో ఈ పెయింటింగ్! దీని ముందు నుంచి వెళ్ళినప్పుడల్లా ఓ రెండు నిమిషాలు తేరిపార చూస్తూండిపోయేది తను!"

అది గుర్తు రాగానే రజని కళ్ళల్లో చివ్వున నీళ్ళుబికాయి. కానీ మనసులో ఏదో తేడాగా అనిపించింది. ఏమిటీ తేడా!

హటాత్తుగా అర్థమయింది రజనికి. మనసులోనుంచి దిగులు ఎగిరిపోతోంది. ఎప్పుడు వచ్చిందో ఎక్కడినుంచి వచ్చిందో కానీ వున్నట్లుండి ఆనందం వచ్చి చేరుతోంది హృదయంలో.

నిజం!! కాలేజ్‌లో ఒక్కొక్క గోడనీ.. ఒక్కొక్క మూలనీ చూస్తుంటే మనసు ఆనందంతో కొట్టుకుపోతోంది.

ఎందుకిలా వుంది!

చివరికి.. ఈ కుండీల్లోని పూలూ.. వాటిమీద పడే లేలేత ఎండా కూడా సంతోషం కలిగిస్తున్నాయే! ఎందుకు!.. ఎందుకు!"

సమాధానం దొరకడం లేదు రజనికి. ఇప్పటివరకూ ఆనందం కోసం తపించింది. ఈ క్షణం దాన్ని అనుభవిస్తూంది.

కానీ అప్పుడూ యిప్పుడూ కూడా అసలు ఆపదానికి నిర్వచనం ఏమిటో తెలీడం లేదు.

"ఏమిటి! ఆనందం అంటే ఏమిటి!

ఇన్నాళ్ళూ గుండెల్లో ఏదో అడ్డం పడినట్లూ.. కదిలిస్తే ఏడుపొచ్చేసేట్లూ వుండేదే.. ఆ ఫీలింగ్‌కి కారణమేమిటి!

ఇప్పుడు.. ఏదో అద్భుతమయిన పిట్ట గుండెల్లో ఎగురుతున్నట్లూ.. సందడి చేస్తున్నట్లూ వుందే! సందర్భం కాకపోయినా పెదవులు నవ్వేందుకు ఆరాటపడుతున్నాయే!.. ఈ ఫీలింగ్‌కి మూలం ఏమిటి?

అవును. అసలు ఆనందం అంటే ఏమిటి ?" రజనికి అర్థం కావడంలేదు.

"కష్టపడడంలోనూ, ఎదగడంలోనూ ఆనందం వుందంటాడు మాధవ్. కానీ యిప్పుడు యిక్కడ తనేం కష్టపడింది? తనలో వచ్చిన ఎదుగుదల ఏముంది!" తనని తనే ప్రశ్నించుకుది రజని. "ఉంది. ఉంది. ఎందుకులేదూ! వుంది." అంతరాత్మ వులికిపడినట్లుగా ఘోషించింది.

"ఈ క్షణం నువ్వేమీ కష్టపడకపోయి వుండచ్చు. ఈ క్షణం నువ్వు ఎదిగి వుండకపోవచ్చు. కానీ ఈ కాలేజ్ వుందే.. యిది ఆ రెండింటినీ నీకు గుర్తు చేస్తోంది. ఇక్కడ చదివినపుడు నువు ఎంతగా కష్టపడేదానివి! క్షణక్షణమూ ఎంతగా ఎదిగేదానివి! ఎన్ని విజయాలు సాధించేదానివి! గుర్తు రావడం లేదూ! వాటన్నిటికీ సాక్ష్యంలా.. దర్పణంలా.. ఈ కాలేజ్ నీకు కనిపించడం లేదూ!"

రజని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "అవును. నిజమే." చుట్టూ పరికించి చూస్తూ అనుకుంది.

ఇక్కడే .. ఈ ప్లే గ్రౌండ్‌లోనే యింటర్ కాలేజ్ కాంపిటీషన్స్ జరిగాయి. తనూ, సరితా టెన్నిస్‌లో ప్రైజ్ సంపాదించారు.

ఎంత ఉత్సాహం! ఎంత కోలాహలం ఆరోజు!

అదిగో అక్కడే రంగోలి కాంపిటీషన్ జరిగేది. ఎంత ఇంట్రస్ట్‌గా పార్టిసిపేట్ చేసేది తను రంగోలి పోటీలలో!

అదొక్కటనే ఏమిటి? ప్రతీ పోటీలో అలాగే పాల్గొనేది.

పెయింటింగ్... ఎస్సే రైటింగ్.

ఎలక్యూషన్‌లో అయితే తను కాలేజ్‌లో ఉన్నన్నాళ్ళూ ఫస్ట్ ప్రయిజ్ తనకే.

చివరికి.. చివరికి ఒకసారి నిట్టింగ్ పోటీలో కూడా పార్టిసిపేట్ చేసింది. తనకసలు ఎంబ్రాయిడరీ చేయడమే రాదు. అయినా సరే. పార్టిసిపేట్ చేసిందీ. అందరూ టకటకా ఎంబ్రాయిడరీ చేస్తుంటే.. తను దారం చిక్కులూ, ముడులూ విప్పుకుంటూ కూర్చోవడం...!"

ఆ సన్నివేశం తల్చుకుంటే ఫక్కున నవ్వొచ్చింది రజనికి.

పార్టిసిపేట్ చేసిన వాళ్ళందరికీ ఒక కర్చీఫ్ యిచ్చారు వాళ్ళప్పుడు. ఎక్కడుందో అది! ఇంటికి వెళ్ళి వెతకాలి. రజని కళ్ళల్లోకి నవ్వూ, నడకలోకి వేగమూ వచ్చాయి.

క్లాస్‌రూంస్ అన్నీ దాటి లైబ్రరీ వైపు నడవసాగింది. అప్పుడు కనిపించారు.. రా..జే..శ్వ..రీ మేడమ్!

గబగబా నడుస్తున్న వారల్లా ఒక్కసారి ఆగి, భృకుటి ముడివేసి చూసి, "నువ్వు.. రజని కదూ!" అన్నారు.

"ఎస్ మేడమ్! " మొహమంతా ఆనందంతో మెరుస్తుండగా చెప్పింది రజని.

"ఊ. హౌ ఆర్ యూ? ఏం చేస్తున్నావు? జాబ్ చేస్తున్నావా!" బాణాల్లా వచ్చాయి ప్రశ్నలు.

"లేదు మేడమ్!"

"ఎందుకని! పిల్లలెంతమంది?"

"ఇంకా లేరు మేడమ్." "మరి! ఇంట్లో కూర్చుని ఏం చేస్తున్నావ్?" ఆశ్చర్యం ధ్వనించింది ఆవిడ కంఠంలో.

"కాలేజ్‌లో మాథ్స్ లెక్చరర్ పోస్ట్ ఖాళీగా వుంది. పార్ట్ టైం జాబ్. చేస్తావా?"

"చేస్తాను మేడమ్" స్పష్టంగా చెప్పింది రజని.

" గుడ్. శేఖర్‌కి కనిపించు అయితే." మాటకు తోడుగా చిరునవ్వు మెరిసింది ఆవిడ పెదవుల మీద.

అదే నవ్వు. రజనికి ఎంతో యిష్టమయిన నవ్వు. ఎలాంటి స్టూడెంట్‌కయినా స్ఫూర్తినిచ్చే నవ్వు.

రజని మైమరచి చూస్తూండగానే ఆవిడ క్లాస్‌రూంలోకి నడిచారు. లోపలికి వెళ్ళే ముందు తలుపు దగ్గర ఒక్కక్షణం ఆగి "అప్లికేషన్ యిచ్చి వెళ్ళు." అని హెచ్చరించారు.

రజని నవ్వుతూ తల వూపింది.

లేడిలా చెంగు చెంగున మెట్లు దిగుతూ క్రిందికి వచ్చింది. శేఖర్ సార్ దగ్గరకి వెళ్ళి రెండు వైట్ పేపర్స్ అడిగి తీసుకుని అప్లికేషన్ వ్రాసిచ్చింది.

మరోసారి కాలేజ్‌ని తనివితీరా చూసి బయటకి నడిచింది. ఒక్కసారిగా ప్రపంచమే మారిపోయిన ఫీలింగ్. ఎటు చూసినా ఆనందం వెల్లివిరుస్తూన్న అనుభూతి.

కాలేజ్‌లోకి వెళ్ళేటప్పటికీ యిప్పటికీ ఎంత తేడా!

"ఎందుకు యిన్నాళ్ళూ అంత బాధపడింది తను! ఎందుకు అలా నిరాసక్తత అనే వూబిలో కూరుకు పోయింది!" ఆశ్చర్యంగా అనుకుంది రజని.

తన ప్రతి అసంతృప్తికీ, నిరాశకీ మాధవ్‌నే బాధ్యుడిని చేసి ఎందుకు ఆలోచించింది!

అంతకు ముందు యిరవై ఏళ్ళు తను స్వతంత్రంగా బ్రతికింది. అప్పుడు తనకంటూ ఓ ప్రపంచం వుండేది. అందులో తను ఆనందంగా.. చాలా ఆనందంగా వుండేది.

ఆ విషయం ఎలా మర్చిపోయింది తను!" తలుచుకుంటేనే చెప్పలేనంత చిత్రంగా అనిపించింది రజనికి.

"తనొక్కతే కాదు. చాలామంది ఆడపిల్లలు అంతే. పెళ్ళయ్యే వరకూ ఎంతో హుషారుగా వున్నవాళ్ళూ, ఎన్నో సాధించిన వాళ్ళూ కూడా పెళ్ళయిన మరుక్షణం నుంచీ తమ ప్రతి ఫీలింగ్‌కీ భర్త మీద ఆధారపడిపోతారు. అతను నవ్వితే ఆనందపడీ.. అతను ముభావంగా వుంటే టెన్షన్‌తో కదిలిపోయీ...

ఎందుకు!.. ఎందుకలా!

ప్రేమించవచ్చు. ప్రేమించడం తప్పు కాదు.

ఆమాటకొస్తే మాధవ్‌కి తనంటే ఎంత ప్రేమ! ప్రాణంలా చూసుకుంటాడు. అతని ప్రతి ఆనందాన్నీ, దుఃఖాన్నీ, విజయాన్నీ తనతోనే పంచుకుంటాడు. అయితే ఆ ఫీలింగ్స్ కోసం తనమీద ఆధారపడడు.

అవును..

స్త్రీ అయినా పురుషుడయినా అలాగే వుండగలగాలి. హృదయం నిండా ప్రేమ నింపి జీవిత భాగస్వామికి అందివ్వగలగాలి. అంతేకానీ ఆ హృదయానికి కావలసిన ప్రతిభావం కోసమూ అవతలివారి మీద ఆధారపడకూడదు.

ఇవ్వడంలో వుండే ఆనందం తీసుకోవడంలో ఎలా దొరుకుతుంది!"

తనలోని మార్పుని మాధవ్ ఎంత ఆనందంగా రిసీవ్ చేసుకుంటాడో వూహించుకుంటే రజనికి అద్భుతంగా అనిపించింది.

మంచంమీద తనప్రక్కగా చేరి.. ఎడమ చేయి నడుము చుట్టూ పెనవేసి.. కుడిచేత్తో ముంగురులు సవరిస్తూ, "నాకు తెలుసు. నువు చాలా మంచి అమ్మాయివి" అని మెచ్చుకుంటాడా!

గుండెల్లో తల దాచుకుంటూ "కాకపోతే కాస్త స్టార్టింగ్ ట్రబుల్. అంతే." అంటాడా!

రజని పెదవులు మందారమొగ్గల్లా విచ్చుకున్నాయి.

కుడిచేయి అప్రయత్నంగా కుడి కంటిమీద ఆనింది. తల సిగ్గుగా భూమివైపు వంగుతుంటే.. బుగ్గల్లోని ఎరుపు ప్రతిఫలించిందేమో భూమి ఎర్రబడింది.
ఆమె కాంపౌండ్ దాటేస్తూంటే మరెవరో అమ్మాయి కాలేజ్ లోపలికి వెళ్తూ కనిపించింది.
ఆపిల్ల కళ్ళల్లో రజని ఆనందాన్ని చూసిన ఈర్ష్య స్పష్టంగా మెరిసింది.

*****

("ఆంధ్రప్రభ" సచిత్ర వారపత్రిక - 16.10.1996 కథాప్రభ)